
డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పైపులైన్ నిర్మాణంతో డ్రైనేజీ సమస్య పరిష్కారం

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ ఈ సేవ వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్య పైపులైన్ నిర్మాణంతో పరిష్కారం కానుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ప్రారంభమైన పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని జలమండలి అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.సురేందర్, సయ్యద్అస్లాం, ముచ్చకుర్తి ప్రభాకర్, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు కరాటే బెల్టులు అందజేస్తున్న సుమన్

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

● ప్రముఖ సినీనటుడు సుమన్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో లలితానగర్ విజయగణపతి ఆలయ ఆవరణలో కరాటే పోటీలు జరిగాయి. సుమన్, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విజేతలకు బెల్టులు అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచి కరాటేలో శిక్షణ ఇప్పించాలని వారు సూచించారు.

'రజాకార్ సినిమాను నిషేధించాలి'

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల త్యాగాలను అవమానపరిచే విధంగా ఉన్న రజాకార్ సినిమాను నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ రావి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ చరిత్రను రజాకార్ సినిమాలో పూర్తిగా వక్రీకరించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, సెన్సార్ బోర్డు స్పందించి సినిమాను నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజకీయ కక్షసాధింపు ధోరణితోనే కవిత అరెస్ట్

ముషీరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షసాధింపు ధోరణితోనే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు కోక రవి ఆరోపించారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర మాజీ కార్యదర్శి జునేద్‌బాగ్దాదీ, నాయకులు డాక్టర్ జగన్, గడ్డం ప్రవీణ్, రాజేష్, కృష్ణ, స్యామ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వి.విజయ్, కేఎస్ ప్రదీప్

నిరుద్యోగులను మోసం చేసిన మోదీని నిలదీయాలి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మోసం చేసిన మోదీని ప్రజలు నిలదీయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.విజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో వారు మాట్లాడారు. 2012లో 2.1 శాతం ఉన్న నిరుద్యోగం నేడు 6.6 శాతానికి పెరిగిందన్నారు. కార్పొరేట్ శక్తులకు 14.5 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో మోదీని ఓడించాలని కోరారు. సమావేశంలో పీవైఎల్ నాయకులు ఈశ్వర్, రవికుమార్, ప్రతాప్, రాకేష్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బంటారం యాదగిరిగౌడ్

గౌడ కులస్థుల మద్దతు కాంగ్రెస్‌కే

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గౌడ కులస్థుల మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటారం యాదగిరిగౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం కవాడిగూడలో జరిగిన గౌడ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 58 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ మంజూరు చేయాలని, తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయపడిన వారికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గీత కార్మికుడు చనిపోతే దహన ఖర్చుల కింద లక్షరూపాయలు ఇవ్వాలని కోరారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఎవరిని నిలబెట్టినా గెలుపునకు కృషి చేయాలని గౌడ కులస్థులకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు గర్వందుల అంజయ్యగౌడ్, రమేష్‌గౌడ్, టి.శివకుమార్‌గౌడ్, ఎం. శంకర్‌గౌడ్, రామన్‌గౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీలకు 8 ఎంపీ స్థానాలు కేటాయించాలి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీలకు 8 ఎంపీ స్థానాలు కేటాయించాలని బీసీ పోరాట సమితి అధ్యక్షుడు ఆరె మహేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీట్లు కేటాయించిన పార్టీకి బీసీల మద్దతు ఉంటుందన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని, బీసీలకు 20 వేల కోట్లతో సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన కోసం విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో సమితి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ పోరాట సమితి అధ్యక్షుడు మహేందర్

గుర్తుతెలియని వ్యక్తి హత్య



చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి మీనాక్షి హోటల్ ఎదుట ఆదివారం ఉదయం 72 సంవత్సరాల వయస్సుగల ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అతడి తలపై గ్రానైట్ రాయితో కొట్టడంతో బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహంపై బ్లూకలర్ చెక్స్ షర్ట్, నేవీ బ్లూకలర్ ప్యాంట్ ఉన్నాయని. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. ప్రాథమికంగా లభించిన ఆధారాల ప్రకారం మృతుడు శాస్త్రి గోపాల్ అలియాస్ గోపాల్‌రెడ్డి అని తెలిసింది.

ట్యాంక్‌బండ్‌పై వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ట్యాంక్‌బండ్‌పై గురజాడ అప్పారావు విగ్రహం వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నాడు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ జీరా రోడ్‌లో కర్బాలా మైదాన్ సమీపంలో వధాన్ హోటల్ పక్కన సుమారు 55 ఏళ్ల వయసు గల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. డయల్ 100కు సమాచారం రావడంతో గాంధీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చుక్కల హాఫ్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి బాలుడి మృతి

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నింబోలిఅడ్డలో నివసిస్తున్న బాలాజీ(16) పదో తరగతి ఫెయిలయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి రాయనున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి పలక్‌నుమాలో అమ్మవారి మందిరానికి వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైలు ఎక్కి ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో జారి మూసీనదిలో పడిపోయాడు. తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు అదృశ్యం

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు అదృశ్యమయ్యారు. హిమాయత్‌నగర్‌లో తల్లీపిల్లలు, నల్లకుంటలో ఒకరు కనిపించకుండా పోయారు. మహబూబ్‌నగర్ జిల్లా మరిపెడ మండలం, గుండెపూడి గ్రామానికి చెందిన ఓర మహేష్‌కు మీనాక్షి అనే మహిళతో 2016లో వివాహం అయింది. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 2లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మహేష్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మీనాక్షి ఇళ్లలో పనిచేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు అద్వైత్(6), అరుషి(4) ఉన్నారు. ఈనెల 7వ తేదీన దంపతుల మధ్య గొడవ జరిగింది. కుటుంబ సభ్యులు వారికి సర్ది చెప్పారు. మహేష్ ఈనెల 13వ తేదీన వరంగల్ వెళ్లాడు. అతడు తిరిగి నగరానికి వచ్చేసరికి మీనాక్షి, పిల్లలు కనిపించలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నల్లకుంటలో..


ప్రవీణ్‌కుమార్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. నల్లకుంట పద్మాకాలనీలో సాయిగీత లోక్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ప్రవీణ్‌కుమార్(51) బిల్డర్. ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుంటుంబ సభ్యులు ఆదివారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఆర్ఐల భూముల కబ్జాపై దర్యాప్తు జరిపించాలి

● మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు


మాట్లాడుతున్న గోనె ప్రకాష్‌రావు

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్‌పేట మండలం, బొమ్మరాజుపేట గ్రామంలో ఎన్ఆర్ఐలకు చెందిన 920 ఎకరాల భూ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. భూ కబ్జా వెనుక మాజీమంత్రుల హస్తం ఉందని ఆరోపించారు. ధరణి కమిటీ వాస్తవాలను సేకరించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొమ్మరాజుపేట గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 323 నుంచి 409 వరకు గల 1,049 ఎకరాల భూమిలో 920 ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. మాజీ ఎంపీ దుగ్గిరాల బలరామకృష్ణ 1965లో ఈ భూమిని మీర్ రహ్మత్ అలీతోపాటు మరో ఆరుగురి నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. ఆయన వారసులైన దుగ్గిరాల అమరేందర్‌బాబుతో పాటు మరో 20 మంది పేరిట భూమి రిజిస్టర్ అయిందన్నారు. భూ హక్కుదారులు విదేశాల్లో స్థిరపడడంతో కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన రైతు సంఘం నేతలకు కొంతమంది మాజీమంత్రులు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేసి జిల్లా కలెక్టర్ ద్వారా పూర్తి ఆధారాలు సేకరించాలన్నారు. రైతు సంఘం నేతలు ధర్నాల ముసుగులో ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతానని ఆయన హెచ్చరించారు.

ఆ అధికారులను బదిలీ చేయండి : టీడీపీ

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అడిషనల్ ఫైనాన్స్ విభాగం అడిషనల్ కమిషనర్ జయరాజ్ కెనెడీతోపాటు మరో 40 మంది పదేళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆదివారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, లీగల్ సెల్ అధ్యక్షుడు పరశురాం, ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, హైదరాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి నాగు నగేష్ మాట్లాడారు. కెనడీ ఉద్యోగ విరమణ చేసి మూడేళ్లయినా అదే పదవిలో ఉండడానికి కారణం ఏమిటని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఆయనను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లేఖ రాసినట్లు వారు తెలిపారు. దీనిపై అధికారులు స్పందించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి చిలకమర్తి


మాట్లాడుతున్న కాశీవిశ్వేశ్వరరావు

చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం అని మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం దశాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహం దళిత వర్గాల విద్య కోసం విద్యాలయం స్థాపించి ఉచితంగా చదువులు చెప్పించారని అన్నారు. పౌరాణిక నవలలు నాటకాలు ప్రహసనాలు అనువాదాలు వంటి పలు సాహితీ ప్రక్రియల్లో చిలకమర్తి దిట్ట అని అన్నారు. హాస్యావధాని శంకరనారాయణ మాట్లాడుతూ.. హాస్య రచనలోనూ చిలకమర్తి దిట్ట అని అన్నారు. ఆయన రచించిన గణపతి నవల ఇందుకు ఉదాహరణ అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, చక్రవర్తి తంగిరాల, వైకుంఠం పాల్గొన్నారు.

ప్రణాళికతో ర్యాంకు 'పది'లం

(5వ పేజీ తరువాయి)

ఎగురవేస్తారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు.

కేంద్రానికి వెళ్లే ముందు ఇవి చూసుకోవాలి..

- హాల్‌టికెట్, బ్లూ, బ్లాక్ పెన్నులు, పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్, స్కేల్, తదితర వస్తువులను సరిచూసుకుని ఒకపౌచ్‌లో పెట్టుకోవాలి. పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను, స్మార్ట్‌వాచ్‌లను తీసుకెళ్లవద్దు.
- రోజూ రాత్రి 10 గంటలలోపు నిద్రపోయి, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు మేల్కోవాలి. పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను ఉదయం పూట చదువుకోవాలి.

కేంద్రంలో పాటించాల్సిన పద్ధతులు..

- ఓఎంఆర్ షీట్‌పై మీ పేరు ఉందో..లేదో సరిచూసుకోవాలి. ఇన్విజిలేటర్ చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలి.
- కనీసం 15 నిమిషాల పాటు ప్రశ్నాపత్రాన్ని చదివి బాగా వచ్చే జవాబులను టిక్ చేసుకోవాలి.
- రాసిన అడిషనల్స్‌ను వరుసక్రమంలో పెట్టాలి. అన్ని సమాధానాలకు ప్రశ్నల నంబర్లు సరిగా వేశారో.. లేదో చూసుకోవాలి.
- జవాబుపత్రంలో ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ క్రాస్ మార్కు ఉంచి పీటీఓ అని రాయాలి.
- తీసుకున్న అడిషనల్ షీట్స్ నంబర్ల సంఖ్యను ఓఎంఆర్ షీట్‌పై తప్పనిసరిగా వేయాలి.
- గణితంలో సిద్ధాంతాలను వరుస క్రమంలో రాయాలి. ఫిజిక్స్, బయాలజీలో చిత్రాలను అందంగా వేసి వాటి పేర్లను, ఆవశ్యకతను వివరించాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి..

- పరీక్షలపై భయం పోగొట్టేందుకు తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి. పరీక్ష బాగా రాస్తావని తరచూ వారిలో నమ్మకాన్ని పెంచాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో వారికి తోడుగా ఉండి, సబ్జెక్టులపై పునశ్చరణ చేయించాలి. ముఖ్యమైన పాయింట్స్‌ను గుర్తుంచుకునే విధంగా షార్ట్‌నోట్స్ రాయించాలి.
- ఉదయం 5 గంటలకు నిద్రలేపి 7 గంటల వరకు చదివించాలి. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందు వెళ్లేలా సిద్ధం కావాలి. పిల్లలు సెంటర్ లోపలికి వెళ్లేవరకు అక్కడే ఉండాలి.
- పరీక్ష బాగా రాయకున్నప్పటికీ.. మరో పరీక్షలో ఎక్కువ స్కోర్ చేసే విధంగా ప్రోత్సహించాలి.

ఎక్కడి నుంచి వచ్చిందో చూడాలి



పరీక్షా కేంద్రంలో విద్యార్థులు టెన్షన్‌కు గురికావొద్దు. ప్రశ్నను జాగ్రత్తగా చదవాలి. ఎక్కడి నుంచి వచ్చిందో గమనించాలి. వచ్చిన వాటిని త్వరగా రాయాలి. గణితంలో వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సమితులు, సంఖ్యాశాస్త్రం, సంభావ్యత, నిరూపణ రేఖాగణితం, రేఖీయ సమూహాల వ్యవస్థ, శ్రేణులు, జామితిలోని నిర్మాణాలను చూసుకుంటే 60శాతం మార్కులు సాధించవచ్చు. - నర్సింహారెడ్డి, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జీహెచ్ఎస్ నల్లకుంట

విశ్వాసంతో పరీక్ష రాయాలి..



ఏ ప్రశ్న వచ్చినా.. రాయగలను అనే విశ్వాసంతో విద్యార్థి పరీక్ష రాయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చడం, నీవు సరిగా రాయలేవు, మర్చిపోతావు అనే మాటలను అనకూడదు.

-డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కౌన్సెలింగ్ థెరపిస్ట్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ గురువాయూర్‌శ్రీకృష్ణ మందిరం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మా వెంకటేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యం.. ప్రజల ఇబ్బంది

ముషీరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ నుంచి పార్శీగుట్ట చౌరస్తా వరకు రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం తవ్విన రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు, స్థానిక వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా విజయ్‌కుమార్

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గండేటి విజయ్‌కుమార్‌ను నియమించారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆయనకు ఆదివారం నియామకపత్రం అందజేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సామాజిక సేవకు వైశ్య ఫెడరేషన్ ప్రాధాన్యం

ముషీరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘసేవకుడు రాందాస్ అగర్వాల్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా వంద మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గుప్తా, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల, నాయకులు సత్తయ్య, పాండయ్య పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నల్లకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట రత్నానగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీకృష్ణ ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మధుగౌడ్, బి. వెంకటేష్, రఘురామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైశ్య హాస్టల్‌లో ఆధునీకరించిన రూమ్‌లను ప్రారంభిస్తున్న ధనుంజయ్

వైశ్యహాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైశ్యహాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జి. ధనుంజయ్ తెలిపారు. కాచిగూడ వైశ్యహాస్టల్‌లో ఏర్పాటు చేసిన డీలక్స్ రూమ్‌లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కూర రఘువీర్, హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సన్మానం



రాష్ట్ర గంగపుత్ర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయిని గంగపుత్ర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి రవిప్రసాద్ ఆదివారం సత్కరించారు. రాష్ట్ర గంగపుత్ర సంఘం గౌరవాధ్యక్షులు కైరంకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జె. జైపాల్‌ను ఆదివారం వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణ ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్లు డా.ఓర్సు కృష్ణయ్య, బండల వెంకటస్వామి, హరికృష్ణ, శ్రీరాములు, హనుమంతరావు, మోహన్ కుమార్, గడ్డం చంద్రయ్య, నల్లగొండ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

ఘనంగా శిరోమణి రవిదాస్ మహరాజ్ జయంతి



నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో బీజేపీ నాయకుడు కె.లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సంత్ శిరోమణి రవిదాస్ మహరాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ రవిదాస్ మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి